సాక్షి శ్రీకాకుళం

మంగళవారం। 10। డిసెంబర్। 2024



పట్టుబడిన కాపర్ కేటుగాళ్లు

కాపర్ కేటుగాళ్లు దొరికారు. రూ.26 లక్షల విలువైన కాపర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

- 8లో



ఆస్తి గొడవల వల్లే హత్య

శ్రీకూర్మం హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఆస్తి గొడవల వల్లే హత్య జరిగినట్లు తెలిపారు.

- 8లో

ప్రపంచ రికార్డు కార్యక్రమంలో కళాకారులు

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం పట్టణానికి చెందిన లయశ్రీ నృత్యకళానికేతన్ చిన్నారులు ఆదివారం ఐసీఎండీఏ వారి వరల్డ్ రికార్డ్స్‌లో పాల్గొన్నట్లు ప్రముఖ నాట్యగురువు కె.పరిమళ హరిహర్ తెలిపారు. ఐసీఎండీఏ వారి 5వ వరల్డ్ రికార్డ్స్ ప్రోగ్రామ్ ఆన్‌లైన్‌లో నిర్వహించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తమ శిష్యులు 20మంది చిన్నారులు పాల్గొని 10నిమిషాలుగల రావణాష్టకం నృత్యాన్ని ప్రదర్శించి రికార్డు సాధించారని తెలిపారు.

న్యూస్‌రీల్

11, 12న మెగా మేళా

శ్రీకాకుళం అర్బన్: శ్రీకాకుళం తపాలా డివిజన్ పరిధిలోని అన్ని పోస్టాఫీసుల్లో ఈనెల 11, 12 తేదీల్లో తపాలా జీవిత బీమా(పీఎల్ఐ), గ్రామీణ తపాలా జీవిత బీమా(ఆర్‌పీఎల్ఐ) మెగా మేళాను నిర్వహిస్తున్నట్లు తపాలాశాఖ సూపరింటిండెంట్ వండాన హరిబాబు తెలిపారు. ఈ మేళాలో రూ.2కోట్ల ప్రీమియం సమీకరణే ధ్యేయంగా ముందుకు వెళుతున్నామని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా ప్రతి ఒక్క పౌరునికి జీవిత బీమాను అందించాలనే లక్ష్యంతో ప్రతి ఒక్క పోస్టాఫీసు పనిచేస్తుందని తెలిపారు. సేవింగ్ ఖాతా మాదిరిగానే పోస్టాఫీసులు అందించే జీవిత బీమాలు ఎక్కువ బోనస్‌ను ఆర్జిస్తున్నాయన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను పర్యవేక్షించాలి



సీడీపీఓ, సూపర్‌వైజర్లతో మాట్లాడుతున్న రీజనల్ జాయింట్ డైరెక్టర్

సారవకోట: అంగన్‌వాడీ కేంద్రాలను ఎప్పటికప్పుడు సూపర్‌వైజర్, సీడీపీఓలు పర్యవేక్షించాలని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ రీజనల్ డైరెక్టర్ చిన్మయి దేవి సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయాన్ని ఆమె ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె స్థానిక సీడీపీఓ, సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. అంగన్‌వాడీల పనితీరు మెరుగుపర్చేందుకు కేంద్రాలను పర్యవేక్షించి లోటుపాట్లు గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని కేంద్రాలకు స్టాక్ సకాలంలో సరఫరా జరిగేటట్లు చూడాలని, ఇటీవల అంగన్‌వాడీ కేంద్రాలకు మంజూరైన పోషణ వాటిక, మరుగుదొడ్లు, తాగునీటి సరఫరా, నీటి గుంత నిర్మాణాల స్థితిపై అడిగి తెలుసుకున్నారు. ఆమెతో పాటు సీడీపీఓ కామాక్షి, సూపర్‌వైజర్లు సుజాత, సీతారత్నం, సునీత ఉన్నారు.


13న ప్రభుత్వ ఐటీఐలో జాబ్‌మేళా

కాశీబుగ్గ: పలాసలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈ నెల 13న ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ పైల జవహర్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు.సాయికుమార్ ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో అపోలో ఫార్మసీ, నవత రోడ్డు ట్రాన్స్ పోర్ట్, పేటీఎం సంస్థలకు అభ్యర్థులకు ఎంపిక చేస్తారని తెలిపారు. ఐటీఐ, డిగ్రీ, ఫార్మసీ విద్యార్హతలు కలిగి 18–35 ఏళ్ల వయస్సు గల అభ్యర్థులు ఆధార్ కార్డు నకళ్లు, విద్యార్హత సర్టిఫికెట్లు, బయోడేటా, పాస్‌పోర్ట్ ఫొటోలు, ఫార్మల్ డ్రస్‌లో ఇంటర్వ్యూకి హాజరు కావాలని అధికారులు తెలిపారు. పూర్తి వివరాలకు 6301046329 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

మంచి ప్రభుత్వమా.. ముంచే ప్రభుత్వమా..?



ఆమదాలవలస మండలం నిమ్మతొర్లువాడలో 150 మంది విద్యార్థులు ఉంటున్న ప్రభుత్వ పాఠశాల మరుగుదొడ్ల దుస్థితి ఇది. నాడు–నేడు రెండో విడత కింద పనులు చేపట్టేందుకు గత ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. కొన్ని పనులు జరిగాయి. కానీ, కూటమి ప్రభుత్వం వచ్చాక పనులు నిలిపివేసింది. దాదాపు రూ.11లక్షల నిధులు ఉన్నప్పటికీ పనులు పూర్తి చేయడం లేదు. ఇప్పుడా అసంపూర్తిగా ఉన్న మరుగుదొడ్లు అక్కరకు రాకుండా ఉన్నాయి. ఇక్కడ పిల్లలు మూత్ర, మల విసర్జనకు బహిర్భూమికి వెళ్లాల్సి వస్తోంది. ఈ సమయంలో విష జంతువుల భయం వెంటాడుతోంది.



జిల్లాలో ఇంటర్, డిగ్రీ, ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలి. దాదాపు 60వేల మందికి పైగా విద్యార్థులకు కూటమి ప్రభుత్వం వచ్చాక రీయింబర్స్‌మెంట్‌చేయలేదు. ఇప్పుడా పిల్లల పరిస్థితి అయోమయంగా తయారైంది. ఫీజులు కట్టలేదని కళాశాల యాజమాన్యాలు సతాయిస్తున్నాయి. ప్రభుత్వానికి చలనం ఉండటం లేదు.

అదే వైఎస్ జగన్ ప్రభుత్వంలో 64,623 మంది విద్యార్థులకు వసతి దీవెన అందాయి. స్కాలర్‌షిప్‌ల కింద రూ.163.02కోట్లు చెల్లింపులు చేసింది. ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద రూ.388.28కోట్లు అందజేసింది. విదేశీ విద్యా దీవెన కింద రూ.67.80లక్షలు చెల్లించింది.





దుప్పలవలస అంబేడ్కర్ గురుకులాల పరిస్థితి చూడండి. ప్రతి నెలా రూ.6లక్షలు చొప్పున ఆరు నెలలకు గాను రూ.36లక్షల మెస్ బిల్లు, నెలకి సరాసరి రూ.44,378 చొప్పున ఆరు నెలలకు గాను రూ.2,66,268 మేర గ్యాస్ బిల్లులు రావాల్సి ఉంది. దీంతో అక్కడి విద్యార్థులకు భోజనం పెట్టడానికి, వారి కోసం వంట చేసే గ్యాస్ కోసం సంబంధిత అధికారులు ఎంత ఇబ్బంది పడుతున్నారో అర్థం చేసుకోవచ్చు. ఈ ఒక్క గురుకులమే కాదు జిల్లాలోని ఉన్న తొమ్మిది గురుకులాల పరిస్థితి ఇలాగే అంతే. జిల్లా వ్యాప్తంగా తొమ్మిది గురుకులాలకు రూ.3.24కోట్ల మేర మెస్ బిల్లులతో పాటు రూ.20లక్షలకు పైగా గ్యాస్ బిల్లులు రాలేదు.



- వసతి గృహాల్లో చదువుతున్న పిల్లలకు ప్రభుత్వం కాస్మోటిక్ చార్జీలు చెల్లించాలి. వాటితోనే ముఖ్యంగా ఆడపిల్లలు తమకు కావాల్సిన వాటిని కొనుగోలు చేస్తారు. కానీ ఇవి కూడా ప్రభుత్వం ఇవ్వలేదు. జిల్లాలోని 10,268 మంది విద్యార్థులకు రూ.65లక్షలకు పైగా ప్రభుత్వం బకాయి పడింది. ఏడు నెలలుగా నిధులు విడుదల చేయకపోవడంతో విద్యార్థుల పరిస్థితి దయనీయంగా మారింది.
- ఎస్సీ వెల్ఫేర్ హాస్టళ్లకు సంబంధించి రూ.23.60కోట్ల మేర మెస్ బిల్లులు ఎనిమిది నెలలుగా విడుదల కావడం లేదు. నిధులు లేక అప్పులు చేసి విద్యార్థులకు భోజనం పెడుతున్నారు. రోజురోజుకీ బకాయిలు పెరిగిపోవడంతో వారికి ఇప్పుడు అప్పు పుట్టే పరిస్థితి కూడా లేకుండా పోతుంది.



- చంద్రబాబు ప్రభుత్వంలో వింతపోకడ
- స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను చెల్లించని పరిస్థితి
- హాస్టల్ మెస్ బిల్లులు, కాస్మోటిక్స్ చార్జీలు ఇవ్వని దుస్థితి
- గ్యాస్‌బిల్లులు కూడా చెల్లించని వైనం
- నాడు–నేడు పనులకు మంగళం
- అప్పుల బారిన పడి ఇబ్బందులు పడుతున్న అధికారులు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

కూటమి ప్రభుత్వంలో ప్రభుత్వ విద్య దయనీయ పరిస్థితులు ఎదుర్కొంటోంది. తమది మంచి ప్రభుత్వమని చెబుతూనే.. ప్రభుత్వ విద్యా వ్యవస్థను ముంచేస్తున్న తీరు విస్మయం కలిగిస్తోంది. ప్రభుత్వం తీరుతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక, స్కాలర్‌షిప్‌లు రాక నరకం చూస్తున్నారు. వసతి గృహాల మెస్ బిల్లులు చెల్లించక వార్డెన్లు, కాస్మోటిక్ చార్జీలు అందక విద్యార్థులు ఇక్కట్లకు గురవుతున్నారు. నాడు–నేడు కింద చేపట్టాల్సిన పనులను నిలిపేసి పాఠశాలల భవనాలను శిథిలావస్థలో ఉంచేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల మధ్య మన విద్యా వ్యవస్థ ఉంది. దీన్నే టీడీపీ నాయకులు విద్యా విప్లవం అంటారేమో.



గ్యాస్ బకాయిలు ఇప్పించాలని మీకోసంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న వేదమాత ఏజెన్సీస్ నిర్వాహకుడు

దీన్ని విప్లవమంటారా?

- పిల్లలకు ఇవ్వాల్సిన కాస్మోటిక్ చార్జీలను ఎగ్గొట్టేసి, ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్‌లు సకాలంలో చెల్లించకుండా, మెస్ బిల్లులను చెల్లించకుండా వసతి గృహాల అధికారులను అప్పులపాలు చేసి, సీబీఎస్‌ఈ సిలబస్, టోఫెల్, ఐబీ శిక్షణకు మంగళం పాడేసి, ప్రైవేటు విద్యా సంస్థలను ప్రోత్సహించేలా తెర వెనక మంత్రాంగం నడపడం విద్యా విప్లవం కింద రాదు.
- కనీసం జిల్లాలోని జిల్లాలో 31ఎస్సీ సంక్షేమ వసతి గృహాలకు రూ.4.32కోట్లు, 58బీసీ వసతి గృహాలకు మరమ్మతులు చేసేందుకు రూ.8కోట్లు అడిగి నెలలు గడుస్తున్నా ఒక్క పైసా విదల్చలేదు.
- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పేరుతో ప్రతిష్టాత్మకంగా నడుస్తున్న గురుకులాల గ్యాస్‌బిల్లులు కూడా ఇవ్వకపోవడంతో వాటికి గ్యాస్ సరఫరా చేయలేమని గ్యాస్ ఏజెన్సీలు చేతులెత్తేస్తున్నాయి. నగరంలోని వేదమాత గ్యాస్ ఏజెన్సీ అయితే సోమవారం గ్రీవెన్స్‌సెల్‌కు వెళ్లి తమకు మూడు గురుకులాల నుంచి రూ.7,15,859 మేర బకాయిలు ఉన్నాయని, వాటిని చెల్లించాలని కోరుతూ అర్జీ ఇచ్చుకునే పరిస్థితి ఏర్పడింది.

- విద్యా విప్లవం అంటే ఏంటో వైఎస్ జగన్ చేసి చూపించారు. నాడు–నేడు కింద పాఠశాలలను ఆధునికీకరించారు. పాఠశాలల రూపు రేఖలను మార్చేశారు.
- పాఠశాలల ప్రాంగణంలో ప్లేగ్రౌండ్‌లో ఏర్పాటు చేశారు. వారికి కావాల్సిన క్రీడా పరికరాలతో పాటు ఆట వస్తువులను అందజేశారు. తరగతి గదుల్లో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్‌ను ఏర్పాటు చేశారు.

విద్యా విప్లవమంటే ఇదీ..

- డిజిటల్ చదువులు అందించారు. పిల్లలకు క్లారిటీగా కనబడేలా గ్రీన్ చార్ట్ బోర్డులను ఏర్పాటు చేశారు. రూమ్‌కొక బీరువా, ఒక్కో తరగతి గదిలో ఐదు ఫ్యాన్లు, ఐదు ట్యూబ్‌లైట్లు ఏర్పాటు చేశారు. పిల్లల మరుగుదొడ్లను క్వాలిటీ టైల్స్, గ్రానైట్ ఫ్లోర్‌తో ఆధునికీకరించారు.
- వాటర్ ఫిల్టర్లు సమకూర్చారు. వంట గదులను గ్రానైట్ ఫ్లోర్స్‌తో నిర్మించారు. సీబీఎస్‌ఈ సిలబస్, ఇంగ్లిష్ మీడియం, టోఫెల్ తరగతులు, ఐబీ, పిల్లలకు ఏటా ట్యాబ్స్, డిజిటల్ తరగతులు, సబ్జెక్ట్ టీచర్లు... ఇలా ఎన్నో విప్లవాత్మక చర్యలు చేపట్టారు.
- అంతేకాకుండా అమ్మ ఒడి కింద ఏడాదికి రూ.15వేలు, వసతి దీవెన, విద్యా దీవెన పేరుతో స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ అందజేశారు.

ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ







మందస మండలం ముకుందపురం–బాలాజీపురం గ్రామాల మధ్య భారీ, అతి భారీ వాహనాలు రోడ్డు పక్కన నిలిపివేయడంతో ప్రమాదకరంగా మారింది. మూడున్నరేళ్ల కిందట పారాదీప్ నుంచి హైదరాబాద్‌కు వేసిన పైప్‌లైన్ పనుల కోసం క్రేన్‌లు, జేసీబీలు, కంటైనర్‌లు, టిప్పర్‌లారీలు, ట్రాక్టర్లు, మిషనరీలు పదుల సంఖ్యలో ఇక్కడకు వచ్చాయి. అయితే రాజమండ్రికి చెందిన పైప్‌లైన్ కాంట్రాక్టర్ మరణించడంతో అతనికి చెందిన కోట్ల రూపాయల మిషనరీలు ఇక్కడే ఉండిపోయాయి. వాటికి రాజస్థాన్‌కు చెందిన జేసీబీ డ్రైవర్ కాపలాగా ఉన్నప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది.

– కాశీబుగ్గ

లోగుట్టు ఎవరికెరుక..?

'ఇండియన్ ఆర్మీ కాలింగ్'లో వెలుగు చూడని నిజాలెన్నో

- ఏడాది కిందటి వీడియోలు బయటకు రావడం వెనుక ఎన్నో అనుమానాలు
- జిల్లాకు చెందిన అధికారుల ప్రోత్సాహం, పాత్రపైనా సందేహాలు



శ్రీకాకుళంలోని ఇండియన్ ఆర్మీ కాలింగ్ సెంటర్

శ్రీకాకుళం క్రైమ్ :

ఒక్క సంస్థ.. వంద అనుమానాలు. నిన్న మొన్నటి వరకు ఆ సంస్థ వద్దకు ఆర్మీ రిటైర్డ్ అధికారుల నుంచి మాజీ ఐపీఎస్‌లు వచ్చారు. సీఐఎస్‌ఎఫ్ నుంచి కూడా ఉన్నతాధికారులు వచ్చి లెక్చర్లు ఇచ్చారు. ఎన్‌సీసీ బెటాలియన్ ఉద్యోగులు సంస్థ నిర్వాహకుడిని తెగ ప్రశంసించారు. ఊరిలో ఏ పెద్ద కార్యక్రమమైనా ఇక్కడి పిల్లలు యూనిఫాం వేసుకుని మరీ హడావుడి చేశారు. ఇదంతా నాణేనికి ఓ వైపు మాత్రమే. అసలు ఇంటర్ కూడా పాస్ కాలేదని పోలీసులు చెబుతున్న బసవ రమణ పిలవగానే ఇంతమంది పెద్దలు ఎలా వచ్చారు..? ఏ అనుమతి లేకుండానే ఆర్మీ లోగోలను అంత ధైర్యంగా రమణ ఎలా వాడుకున్నాడు..? కనీసం గుర్తింపు కూడా లేకుండా ఏకంగా జిల్లా కేంద్రంలో అంత పెద్ద సంస్థను ఎలా నడపగలిగాడు..? ఇవన్నీ నాణేనికి మరోవైపు. ఒకే ఒక్క వీడియో బయటకు రావడంతో ఈ ప్రశ్నలన్నీ ఉదయించాయి. ఇండియన్ ఆర్మీ కాలింగ్ సంస్థ వెనుక వెలుగు చూడని నిజాలెన్నో దాక్కుని ఉన్నాయి. మంగళవారం ఈ సంస్థ నిగ్గు తేల్చేందుకు రెండు తెలుగు రాష్ట్రాల ఆర్మీ డిప్యూటీ జనరల్ కమాండింగ్ అధికారి బ్రిగేడియర్ ఎస్‌వీ నంజుదేశ్వర వస్తున్నారని, ఇప్పటికే దీనిపై ఒక నివేదిక ఇవ్వడానికి మాజీ ఆర్మీ ఉద్యోగుల సంఘం సిద్ధంగా ఉందని సమాచారం.



ఉన్నతాధికారులు ఎలా వచ్చారు..?

గత కలెక్టర్ల నుంచి ఎస్పీల వరకు కింది స్థాయి నుంచి ఉన్నత స్థాయి వరకు అందరూ ఏదో ఒక సందర్భంలో ఈ సంస్థ నిర్వాహకుడు రమణను ఆకాశానికెత్తిన వారే. అధికారులు నిర్వహించే 5కె, 10కె రన్‌లు, కొన్ని అవగాహన కార్యక్రమాలకు రమణ తమ సంస్థ నుంచి పిల్లలను పంపిస్తుండడంతో అతనిపై ఏమాత్రం అనుమానం పెంచుకోకుండా అధికారు లు నమ్మేశారు. కొందరు పోలీసు శాఖలో ఉన్న వారు పెట్టుబడులు పెట్టారన్న ఆరోపణలు కూడా వినిపించడం గమనార్హం. రమణపై ముందు నుంచి జిల్లా మాజీ ఆర్మీ అధికారుల సంఘానికి అనుమానం ఉన్నా యుద్ధ సేవా మెడల్ పొందిన రాజ్‌పాల్‌సింగ్ రావడంతో వీరు రమణపై ఆరా తీయలేకపోయారు. అప్పటికే రమణ నాయకుల నుంచి అధికారుల వరకు అందరినీ తన వైపు తిప్పుకున్నాడు.

50 ఎకరాలు కావాలంటూ..

కొన్నేళ్ల కిందట అకాడమీకి 50 ఎకరాలు కావాలని రమణ కలెక్టర్‌కు అర్జీ పెట్టుకోవడం, కలెక్టర్ జిల్లా సైనిక్ వెల్ఫేర్ అధికారికి దీనిపై నివేదిక కోరగా.. ఆ సంస్థకు ఆర్మీకి సంబంధం లేదని వారు తేల్చి చెప్పారు. నిర్వాహకుడైన రమణ విషయం కూడా తమకు తెలియదని ని వేదికను ఇవ్వడంతో ఐదు నెలలుగా మాజీ ఆర్మీ సంఘం కూడా రమణపై నిఘా వేసినట్లు సమాచారం. ఉద్యోగం వస్తుందనే ఆశతో ఈ సంస్థలో చేరిన పిల్లలు ఎన్నో అవమానాలు భరించారు. సీసీ కెమెరాలు పెట్టినా తమ అనుమతితోనే పెట్టారని కూడా చెప్పారు. ఫిర్యాదు సైతం ఇవ్వకపోవడం గమనార్హం.

అసలు సూత్రధారులు ఎవరు...?

ఏడాది కిందట ఓ విద్యార్థిని రమణ చిత్రహింసలకు గురిచేస్తున్న వీడియో ఇప్పుడు బయట పడింది. ఈ వీడియో బయట పడడం వెనుక అదృశ్య శక్తులు ఉన్నట్లు సమాచారం. బాలికల వసతి గృహంలో సీసీ కెమెరాలున్నాయని తెలిసి వెళ్లిన పోలీసులు ఎందుకు ఆ కేసు దర్యాప్తును తాత్సారం చేశారన్నది ఇప్పటికీ తెలీదు. గతంలో ఆర్మీకాలింగ్‌లో ఇన్‌స్ట్రక్టర్‌గా పనిచేసి మానేసిన విజయనగరం జిల్లాకు చెందిన ఓ వ్యక్తే ఈ వీడియోలు బయటపెట్టాడని, ఆర్థిక లావాదేవీలే కారణమనే వాదన వినిపిస్తోంది. కాలింగ్ సెంటర్‌లో అరాచకాలకు సంబంధించి ఇంకా అనేక వీడియోలు ఇతని వద్దనే ఉన్నాయన్న ప్రచారం జరుగుతోంది. అలాగే నగరానికి చెందిన ఓ మహిళ హస్తం కూడా ఉన్నట్లు తెలుస్తోంది. రమణకు వెన్నుదన్నుగా ఉన్న ఓ స్వచ్ఛంద సంస్థకు చెందిన వ్యక్తిని పోలీసులు విచారణ కోసం పిలిచి తర్వాత వదిలేశారు. ఇలా ఎందుకు చేశారన్నది కూడా ఇప్పుడు జిల్లాలో హాట్ టాపిక్.

బిగుస్తున్న ఉచ్చు

ఇండియర్ ఆర్మీ కాలింగ్ వ్యవస్థాపకుడు బసవ రమణ చుట్టూ ఉచ్చు బిగుసుకుంటోంది. ఇప్పటికే సంస్థ కార్యకలాపాలపై తీవ్రమైన ఆరోపణలు ఉన్నాయి. దీనికి తోడుగా సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో దాదాపు 15 మంది బసవ రమణపై ఫిర్యాదు చేశారని, జాబుల కోసం డబ్బులు ఇచ్చామని అన్ని ఆధారాలను ఎస్పీ ముందు ఉంచినట్లు సమాచారం. ఎస్పీ సైతం మూడు రోజుల్లో ఈ కేసును కొలిక్కి తెస్తానని మాట ఇవ్వడంతో వీరంతా వెనుదిరిగినట్లు తెలుస్తోంది. వీరితో పాటు మరో పది మంది సుమారు రూ. 2 కోట్ల మేర నష్టపోయినట్లు పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. ఏ హాస్టల్‌లో అయితే బాలుడిని కొట్టారో.. ఆ హాస్టల్ కాంపౌండ్‌ను ఆదివారం ఖాళీ చేయించారు.

గార్డులుగా..

ఇక్కడ విద్యార్థులను రమణ ఫిట్‌గా తయారు చేసి బౌన్సర్లుగా మార్చి ప్రైవేటు, పబ్లిక్ కార్యక్రమాల్లోను, షాపింగ్ కాంప్లెక్సు ప్రారంభోత్సవాల్లోను గార్డులుగా వినియోగిస్తుంటారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇలా డబ్బులు సంపాదించినట్లు కూడా చెబుతున్నారు. అయితే రమణ నోరు విప్పితే ఎంత మంది బండారం బట్టబయలవుతుందో అన్నది ఇప్పుడు చర్చనీయాంశం.

ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేశాడు..

శ్రీకాకుళం క్రైమ్ : విజయనగరం జిల్లా గజపతినగరం పురిటిపెంట గ్రామానికి చెందిన శానాపతి కృష్ణప్రసాద్‌కి ఉద్యోగమిప్పిస్తానని చెప్పి ఇండియన్ ఆర్మీ కాలింగ్ నిర్వాహకుడు బసవ వెంకటరమణ మోసగించినట్లు ఒకటో పట్టణ ఎస్ఐ ఎం.హరికృష్ణ తెలిపారు. ఆన్‌లైన్‌లో ప్రకటన చూసి కృష్ణ ప్రసాద్ ఇండియన్ ఆర్మీ కాలింగ్‌లో చేరాడని, 2020 అక్టోబరు 10న ఆర్మీలో జాబ్ ఇప్పిస్తానని రమణ రూ.5లక్షలు తీసుకున్నాడని, ఈ మేరకు ఫిర్యాదులో పేర్కొన్నాడని ఎస్ఐ తెలిపారు. కృష్ణప్రసాద్‌కు డిజిటల్ అసిస్టెంట్ ఉద్యోగం రావడంతో అప్పట్లో మిన్నకుండిపోయాడని, ఇప్పుడు రమణ మోసాలు బయటపడుతుండడం, డబ్బులు కూడా తిరిగి ఇవ్వకపోవడంతో పోలీసులను ఆశ్రయించాడని తెలిపారు. దీనిపై సోమవారం రాత్రి కేసు నమోదు చేశామన్నారు.

రూ.5లక్షలు తీసుకున్నాడు

ఆర్మీలో జాబ్ ఇప్పిస్తానని చెప్పి రూ. 5 లక్షలు తీసుకుని ఇండియన్ ఆర్మీ కాలింగ్ సెంటర్ నిర్వాహకుడు బసవ వెంకటరమణ మోసగించాడని ఎ.జగదీష్ శ్రీకాకుళం రూరల్ పోలీసులను సోమవారం రాత్రి పదిన్నర గంటలకు ఫిర్యాదు చేశాడు. జగదీష్‌ది విజయనగరం జిల్లా గజపతినగరం. జాబ్ వేయకపోవడంతో అతని వద్దనే ట్యూటర్‌గా డబ్బులు కోసం చేరాల్సి వచ్చిందని ఫిర్యాదులో పేర్కొన్నాడు.

11, 12 తేదీల్లో వానలకు అవకాశం

- రైతులు అప్రమత్తంగా ఉండాలి
- 12 తర్వాతే కోతలు, నూర్పులు చేయాలి
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: తుఫాన్ ప్రభావం వల్ల 11, 12 తేదీల్లో జిల్లాలో వానలు పడే అవకాశం ఉందని, రైతులు 12వ తేదీ తర్వాతే కోతలు, నూర్పులు చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సూచించారు. ఆయన సోమవారం జిల్లా పరిషత్‌లో జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. 64 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనాల్సి ఉందన్నారు. రెండు రోజుల్లో మన వద్ద ఉన్న మిషనరీ, వాహనాలు, బస్తాలతోను, మిల్లర్లు కెపాసిటీతో 30 వేల టన్నులు కొనుగోలు చేయవచ్చన్నారు. ఒక రోజులో 15 వేల టన్నులు ధాన్యం కొనుగోలు చేయవచ్చని తెలిపారు. మరో 34 వేల టన్నులు ధాన్యం ఉంటుందని, ఆ ధాన్యాన్ని సురక్షితమైన ప్రదేశాలకు తరలించాలని కోరారు. టార్పాలిన్లు అందించేందుకు చర్యలు చేపడతామన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో ధాన్యం సేకరణలో ఇప్పటి వరకు ఎలాంటి సమస్య రాలేదన్నారు. ఈ నెల 12 వరకు వరికి నష్టం జరిగే అవకాశం ఉందన్నారు. నూర్చే ధాన్యం సిద్ధంగా ఉంటే జిల్లాలో 402 ధాన్యం సేకరణ కేంద్రాలు సిద్ధంగా ఉన్నాయని, వెంటనే ధాన్యం సేకరణ కేంద్రాలను సంప్రదించి ధాన్యం విక్రయించాలని కోరారు. పలాస, ఇచ్ఛాపురంలలో పంట కోత ఇంకా చేయలేదని, జిల్లాలో నరసన్నపేట, టెక్కలి, ఆమదాలవలస, ఎచ్చెర్ల, పాతపట్నం, శ్రీకాకుళంలలో కోతలు, నూర్పులు జరుగుతున్నందు వల్ల రైతులు జాగ్రత్తగా ఉండాలన్నారు. జిల్లాకు ఇప్పటి వరకు 4.9 లక్షల మెట్రిక్ టన్నుల లక్ష్యం ఉందని, ఇప్పటి వరకు 1.1 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని తెలిపారు. తడిసిన ధాన్యం కొనుగోలుకు మిల్లర్లకు తగు సూచనలు జారీ చేసినట్లు చెప్పారు.

క్లుప్తంగా

ఇసుక లారీ సీజ్

ఆమదాలవలస: అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని సీజ్ చేసినట్లు ఎస్ఐ కె.వెంకటేష్ తెలిపారు. ఆదివారం అర్ధరాత్రి నాగావళి నది నుంచి అక్రమ తవ్వకాలు జరిపి లారీ ద్వారా ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో, వెంటనే రాత్రి 2 గంటల సమయంలో కొత్త రోడ్డు సమీపంలో ఇసుక లారీని ఆపారు. అనంతరం పత్రాలను పరిశీలించగా ఎటువంటి అనుమతి లేకపోవడంతో సీజ్‌చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించామని తెలిపారు. సీజ్ చేసిన ఇసుక లారీని జిల్లా గనుల శాఖ అధికారులకు అప్పగించామని, తదుపరి గనుల శాఖ ఆదేశాల మేరకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు


గాయపడిన విక్రమసాయి

ఎచ్చెర్ల: లావేరు మండలంలో బెజ్జిపురం సమీపంలోని జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో విజయనగరం జిల్లా చీపురుపల్లి మండలం చిన్ననడిపిల్లి గ్రామానికి చెందిన కుప్పిలి విక్రమసాయి అనే వ్యక్తికి గాయాలయ్యాయి. ద్విచక్ర వాహనంపై శ్రీకాకుళం నుంచి రణస్థలం వెళ్తున్న విక్రమసాయిని రణస్థలం నుంచి శ్రీకాకుళం వైపు వస్తున్న బొలెరో వ్యాను ఢీకొనడంతో ఈ ప్రమాదం సంభవించింది. ప్రమాదానికి గురైన విక్రమసాయి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. లావేరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గ్రావెల్ తవ్వకాలు అడ్డగింత


పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

రణస్థలం: మండలంలో సంచాం గ్రామ రెవెన్యూలోని 89-6లో ఉన్న 3 హెక్టార్లలో గ్రావెల్ తవ్వకాలకు గుండు కై లాస్‌రావు జూన్‌లో అనుమతులు పొందారు. దీంతో తవ్వకాలను సోమవారం మొదలుపెట్టగా, గ్రామస్తులంతా వచ్చి అడ్డుకుని రెవెన్యూ అధికారులకు తెలియజేశారు. పంచాయతీ తీర్మానం లేదని గ్రామస్తులు ప్రశ్నించగా, 7 ఎకరాల లోపు అవసరం లేదని అధికారులు తెలియజేశారు. ఈ వివాదంపై తహసీల్దార్ ఎస్.ప్రసాద్ మాట్లాడుతూ కై లాస్‌రావు పేరున వచ్చిన అనుమతులకు సరిహద్దులు నిర్ధారణ చేస్తామని, అంతవరకు తవ్వకాలు జరపరాదన్నారు. అలాగే అనుమతులకు మించి తవ్వకాలు జరపకూడదని స్పష్టం చేశారు. పరిశీలనలో ఆర్ఐ ఎం.సతీష్, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

ఉత్సాహంగా కళా ఉత్సవ్ పోటీలు

గార: జిల్లాస్థాయి కళా ఉత్సవ్ పోటీలు ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. సోమవారం వమరవల్లి ప్రభుత్వ డైట్‌లో నిర్వహించిన ఈ పోటీల్లో పలు పాఠశాలల నుంచి 100 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఓకల్ మ్యూజిక్, ఇన్‌స్ట్రుమెంటల్ మ్యూజిక్, డ్యాన్స్, థియేటర్, విజువల్ ఆర్ట్స్ వంటి ఆరు అంశాల్లో పోటీలు జరిగాయి. మొదటి ఐదు విభాగాల్లో కవిటి జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు ప్రథమ స్థానం సాధించగా, విజువల్ ఆర్ట్స్‌లో ఆక్స్‌ఫర్డ్ స్కూల్ విద్యార్థులు నిలిచారు. వీరంతా బుధవారం రాష్ట్రస్థాయి కళా ఉత్సవ్ పోటీల్లో పాల్గొననున్నారు. విద్యార్థులను జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య, డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎ. గౌరిశంకర్, డైట్ అధ్యాపక సిబ్బంది, ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మరో ఉద్యమం తప్పదు

కాశీబుగ్గ: రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఎయిర్ పోర్టు కోసం బలవంతపు భూసేకరణ ఆపాలని వామపక్ష నాయకులు డిమాండ్ చేశారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో సోమవారం నిర్వహించిన వామపక్షాల సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సముద్ర తీర ప్రాంతాన్ని కార్పొరేట్లకు కట్టబెడితే సహించేది లేదని హెచ్చరించారు. జిల్లాలో పైడిభీమవరం నుంచి ఇచ్ఛాపురం వరకు 198 కిలోమీటర్ల సముద్రతీర ప్రాంతాన్ని కార్పొరేట్ల కంపెనీలకు కట్టబెట్టడానికి పూనుకుందని అన్నారు. గతంలో అభివృద్ధి పేరుతో ఈస్ట్‌కోస్ట్ పవర్ ప్లాంట్‌కు ప్రభుత్వం 2020 ఎకరాలు ఇస్తే ఈస్ట్‌కోస్ట్ కంపెనీ బ్యాంకులో తాకట్టు పెట్టి డబ్బులు తీసుకొని దివాలా పిటిషన్ వేస్తే ప్రభుత్వం ఆక్షన్ వేసి అమీర్‌పేట్ లాజిస్టిక్ కంపెనీకు రూ.26 కోట్లకు ఇచ్చిందని గుర్తు చేశారు. ప్రజల ఆస్తిని కార్పొరేట్ ఆస్తిగా మార్చేస్తున్నారని విమర్శించారు. జిల్లాను సస్యశ్యామలం చేయాలంటే వంశధార ప్రాజెక్ట్ పున:నిర్మించాలని కోరారు. యాభై ఏళ్లు కావస్తున్న వంశధార ఆధునికీకరణకు రూ.వెయ్యి కోట్లు కేటాయించాలని కోరారు. వంశధార ఆధునికీకరణకు ప్రభుత్వం ఎందుకు నిధులు కేటాయించడం లేదో చెప్పాలని, పెండింగ్ ప్రాజెక్టులు వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అదానీప్రదేశ్‌గా మార్చేస్తుందని ఆరోపించారు. జీడి, కొబ్బరి పంటలకు గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి గోవిందరావు, సీపీఐ కార్యదర్శి చాపర వేణుగోపాలరావు, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు, సీపీఐఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి తామాడ సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

పట్టుబడిన కాపర్ కేటుగాళ్లు


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వివేకానంద, పక్కనే సీఐ పైడపునాయుడు

- ట్రిమాక్స్‌లో చోరీ కేసులో నలుగురు అరెస్టు
- రూ.26.34 లక్షల విలువైన కాపర్ స్వాధీనం
- మరో నాలుగు కేసుల్లోనూ వీరి హస్తం

శ్రీకాకుళంక్రైమ్: మూతపడిన కంపెనీలే వారి లక్ష్యం.. కాపర్ కాయిల్స్, వైర్లు, కేబుళ్ల చోరీపైనే వీరి దృష్టి. దొంగిలించిన సొత్తును దగ్గరలో తోటల్లోకి, లేదంటే కారులో విశాఖకు తరలించి అక్కడి స్క్రాప్ యజమానికి అమ్మేసి సొమ్ము చేసుకోవడమే వీరి పని. జిల్లాలోని మూడు చోట్ల, విజయనగరం జిల్లా బొబ్బిలిలో మరో చోట ఈ తరహా నేరాలకు 2022 నుంచి పాల్పడి చివరికి గార పోలీసులకు పట్టుబడ్డారు. వీరిలో ప్రధాన నిందితుడు గార మండలం కొమరవానిపేటకు చెందిన కొమర తారకేశ్వరరావుతో పాటు విశాఖపట్నం జిల్లా గాజువాక పెద గంట్యాడ సమీపంలోని గంగవరానికి చెందిన కదిరి హరీష్, గాజువాకకు చెందిన గడ్డిపాటి తిలక్‌కుమార్ అలియాస్ అభి, పెద గంట్యాడకు చెందిన చెన్ను చంటిలను పోలీసులు సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వీరినుంచి రూ.26.34 లక్షల విలువైన 772 కిలోల కాపర్‌ను స్వాధీ నం చేసుకున్నారు. ప్రధానంగా గార మండలం వత్సవలస, తోనంగికి ఆనుకొని ఉన్న ట్రిమాక్స్ కంపెనీలో ఈనెల 2వ తేదీన రూ.27.35 లక్షల విలువైన సొత్తు దోచుకోవడం, ఇదే కేసులో విచారణ చేయగా మిగతా చోట్ల చోరీలు బయటపడటం విశేషం. దీనికి సంబంధించి జిల్లా కేంద్రంలోని గూనపాలెం సమీప సబ్ డివిజనల్ కార్యాలయంలో డీఎస్పీ సీహెచ్ వివేకానంద విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు.



బృందాలుగా విడిపోయి గాలింపు

ఈనెల 2వ తేదీ రాత్రి ట్రిమాక్స్ కంపెనీ (వత్సవలస) ఎంఎస్‌పీ మెయిన్‌ప్లాంట్, సోలార్ ప్లాంట్, పీసీపీ ప్లాంట్, ట్రిమాక్స్ సాండ్స్ ప్రైవేట్ లిమిటెడ్ (తోనంగి)కు చెందిన ప్లాంట్‌లలో కిటికీల ఇనుప గ్రిల్స్ తొలగించి కాపర్ కాయిల్స్, ఫ్లెక్సిబుల్ వైర్లు, ఐస్‌బార్స్, ప్లేట్లు దొంగిలించారు. దీనిపై సెక్యూరిటీ అధికారి నెమలపురి వెంకటరమణ ఫిర్యాదు చేయడంతో గార ఎస్ఐ జనార్ధన కేసు నమోదు చేశారు. ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి ఆదేశాలతో డీఎస్పీ సీహెచ్ వివేకానంద సమక్షంలో రూరల్ సీఐ పైడపునాయుడు, సీసీఎస్ టీమ్ సహకారంతో దర్యాప్తు ప్రారంభించారు. విచారణలో నిందితుల గురించి సమగ్రంగా తెలుసుకున్న పోలీసులు బృందాలుగా విడిపోయి గాలించారు.

పట్టుబడ్డారిలా..

సోమవారం ఉదయం 8 గంటల ప్రాంతంలో హరీష్ హోండాసిటీ కారులో తరలిస్తున్న కాపర్‌ను పోలీసులు పట్టుకున్నారు. అనంతరం వారిని విచారించగా తాము విశాఖ గాజువాకకు తీసుకెళ్లి, అక్కడ స్క్రాప్ యజమాని పైలా ప్రకాష్‌కు కిలో రూ.500 చొప్పున అమ్ముతున్నట్లు, గతంలో మూడు పర్యాయాలు అలాగే చేసినట్లు ఒప్పుకున్నారు. అందులో 412 కిలోల కాపర్‌వైర్లు, 360 కిలోల కేబుల్ వైర్లు కలిపి మొత్తంగా 772 కిలోల కాపర్ ఉన్నట్లు గుర్తించి కారుతో సహా స్వాధీనం చేసుకున్నారు. మిగతా ప్రాపర్టీ సమీప తోటల్లో డిస్పోజల్ చేసి ఉంచారు. ట్రిమాక్స్ కంపెనీలోనే కాకుండా వీరు 2022లో జిల్లాలోని సరుబుజ్జిలి కాగితాపల్లి (కొమ్మనాపల్లి బ్రిడ్జి) వద్ద వంద కిలోల కాపర్ వైర్లు దొంగిలించారు. అలాగే 2023 జనవరిలో విజయనగరం జిల్లా బొబ్బిలిలో ఉన్న యోనా స్మెల్టర్స్ లిమిటెడ్‌లో వంద కిలోల కాపర్‌వైర్లు చోరీ చేశారు. అదే ఏడాది జూన్‌లో గార మండలం అంపోలులో లిఫ్ట్ ఇరిగేషన్ బిల్డింగ్ షట్టర్ లాక్ విరగ్గొట్టి లోపలికి చొరబడి మోటార్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి రూ.18 వేలు విలువైన 30 కిలోల కాపర్ కాయిల్స్ చోరీ చేశారు. దీంతో కేసును ఛేదించిన పోలీసులను ప్రత్యేకంగా డీఎస్పీ అభినందించారు.

గతంలోనూ నేరాలే..

పట్టుబడిన నేరస్తులపై గతంలోనూ కేసులు ఉన్నాయి. తారకేశ్వరరావు ఆటో డ్రైవర్‌గాను, హరీష్, తిలక్‌లు ఫ్యాబ్రికేషన్ వర్క్‌లోను, చంటి రాడ్ బెండర్‌గాను పనులు చేసేవారు. అయితే అధిక ధనార్జన ఆశతో ఈ చోరీలకు పాల్పడినట్లు డీఎస్పీ చెప్పారు. వీరిలో తారకేశ్వరరావుపై 5 పాత కేసులుండగా, హరీష్‌పై ఒకటి, తిలక్‌పై రెండు, చంటిపై ఐదు కేసులు ఉన్నాయి. అలాగే వీరికి సహకరించిన పైలా ప్రకాష్‌పై నాలుగు కేసులు ఉన్నాయి.

అర్జీల పరిష్కారంపై దృష్టి సారించాలి

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్
- మీకోసంలో 71 అర్జీల స్వీకరణ

శ్రీకాకుళం పాతబస్టాండ్: అర్జీల పరిష్కారంపై అధికారులు దృష్టి సారించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక(మీ కోసం)లో భాగంగా అర్జీదారుల నుంచి ఆయనతో పాటు జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ అర్జీలు స్వీకరించారు. మొత్తం 71 అర్జీలు స్వీకరించగా, వీటిలో రెవెన్యూ - 28, పంచాయతీరాజ్ - 5, సర్వే అండ్ లాండ్ రికార్డులు - 4, సొసైటీ ఫర్ ఎలిమినేషన్ రూరల్ పవర్టీ - 3, ఏపీ టిడ్కో - 3, ఏపీఈపీడీసీఎల్ - 3, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ - 2, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు - 2, ట్రైబల్ వెల్ఫేర్ ఇంజనీరింగ్ - 2, స్కూల్ ఎడ్యుకేషన్ - 2, ఏపీ స్కిల్ డవలప్‌మెంట్ - 2, మహిళా శిశు సంక్షేమ శాఖ - 2, రూరల్ డవలప్‌మెంట్ - 2, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ - 2, ట్రెజరీ, దేవదాయ శాఖ, మైన్స్ అండ్ జియాలజీ, రిజిస్ట్రేషన్, పబ్లిక్ హెల్త్, సాంఘిక సంక్షేమ శాఖ, వ్యవసాయ శాఖ, ఆర్‌డబ్ల్యూఎస్, విభిన్న ప్రతిభావంతులు శాఖలకు సంబంధించి ఒక్కొక్క అర్జీ స్వీకరించారు. కార్యక్రమంలో ఉప కలెక్టర్ అప్పారావు, జెడ్పీ సీఈవో ఎల్ఎస్‌వీ శ్రీధర్ రాజ తదితరులు ఉన్నారు.

తప్పుల తడకగా ఓటర్ల జాబితా


కలెక్టర్‌కి వినతిపత్రం అందజేస్తున్న చింతాడ రవికుమార్ తదితరులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఈనెల 14వ తేదీన నిర్వహించనున్న సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితా తయారీ నుంచి ఎన్నికల ప్రక్రియ వరకు మొత్తం లోపభూయిష్టంగా ఉందని, ఈ ప్రక్రియ మొత్తం పునః సమీక్షించాలని ఆమదాలవలస నియోజకవర్గ రైతులు, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త చింతాడ రవికుమార్‌లు కోరారు. ఈ మేరకు జెడ్పీలో నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో వినతిపత్రం సోమవారం అందజేశారు. నీటి సంఘాల ఎన్నికల కోసం అధికారులు తయారు చేసిన ఓటర్ల జాబితాలో అనేక పొరపాట్లు ఉన్నాయని, వాటికి సంబంధించిన రుజువులు అందజేశారు. జాబితాలో అనేక పేర్లు రెండు లేదా అంతకంటే ఎక్కువసార్లు నమోదై ఉన్నాయన్నారు. ఒకే ఓటర్ పేరు ఒకే సంఘంలో, ఒకే ప్రాదేశికంలో రెండు మూడుసార్లు నమోదు కావడం వలన ఓటుహక్కు వినియోగంలో అనేక ఇబ్బందులు కలిగే అవకాశం ఉందని తెలిపారు. ఇప్పటివరకు ఓటర్లకు ఎన్నిక గురించి ఎటువంటి సమాచారం లేదన్నారు. పరిశీలనలో ఉన్న చేతులు ఎత్తే ఎన్నిక విధానం వలన సరైన ఓటర్ తీర్పు రాదని గ్రహించాలన్నారు. స్వేచ్ఛాపూరిత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలని కోరారు. ఆయనతో పాటు ఆమదాలవలస, పొందూరు మండలాల నాయకులు, పైడి పోలయ్య ఉన్నారు.


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ విజయ

కలెక్టర్‌ను కలిసిన జెడ్పీ చైర్‌పర్సన్ విజయ

కంచిలి: ఇచ్ఛాపురం నియోజకవర్గం పరిధిలో గత ప్రభుత్వ హయాంలో వివిధ వంతెనలను ప్రతిపాదించి సాంకేతిక అనుమతులు, పరిపాలన, ఆర్థిక అనుమతులు మంజూరు చేసి, టెండర్లకు పిలవడం జరిగిందని, ఆ దశలో ఆగిన వంతెనలను ప్రజోపకారం దృష్ట్యా సత్వరమే నిర్మించాలని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ కోరారు. ఈ మేరకు జెడ్పీ సమావేశ మందిరంలో కలెక్టర్‌ను సోమవారం కలిసి సమస్యలను విన్నవించారు. ఇచ్ఛాపురం మున్సిపాలిటీని కలుపుతూ బహుదా నదిపై కొత్త వంతెన నిర్మాణానికి రూ.20 కోట్లు, సోంపేట మండలం బారువ కొండిరేవు వంతెన నిర్మాణానికి రూ.3.45 కోట్లు, బారువ టౌన్ సమీపంలో మహేంద్రతనయ నదిపై వంతెన నిర్మాణానికి రూ.14.60 కోట్లు అప్పట్లో మంజూరు చేసినట్లు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ వంతెనల నిర్మాణాలు చేపడితే ఆ ప్రాంతీయులకు ఉపయుక్తంగా ఉంటుందని పేర్కొన్నారు.

దొంగతనం కేసులో పట్టుబడిన మైనర్లు


పోలీసులు స్వాధీనం చేసుకున్న ఆటో

సారవకోట: మండలంలోని కొత్తూరు రోడ్డు సమీపంలో శనివారం ద్విచక్ర వాహనం చోరీకి గురైందని కొత్తూరు గ్రామానికి చెందిన దమ్ము చిన్నారావు సారవకోట పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించిన ఎస్ఐ అనీల్ కుమార్ దొంగతనం చేసిన ఇద్దరు మైనర్లను సోమవారం పట్టుకున్నారు. దీనిపై ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. విశాఖపట్నంలోని కంచరపాలేంకు చెందిన 17 ఏళ్ల మైనర్లు కొత్తూరు జంక్షన్‌లో పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాన్ని చోరిచేసి తీసుకెళ్లారు. దీనిని సోమవారం పాతపట్నం వైపు నుంచి ఆటోలో తీసుకొస్తుండగా కురిడింగి సమీపంలో చేపట్టిన వాహన తనిఖీలో అనుమానాస్పదంగా కన్పించడంతో ఇద్దరినీ విచారించారు. అనంతరం చోరీకి గురైన ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. అయితే మైనర్లు ద్విచక్ర వాహనం తరలిస్తున్న ఆటో సైతం విశాఖపట్నంకు చెందినదేనని, ఆ ఆటోను సైతం దొంగతనం చేసి తీసుకొచ్చినట్లు గుర్తించారు. ఇదివరకే వీరిపై విశాఖపట్నంలో 15 కేసులు నమోదైనట్లు గుర్తించామన్నారు. వారిద్దరినీ వాళ్ల తల్లిదండ్రులకు అప్పగించామని పేర్కొన్నారు. విశాఖపట్నం నుంచి ఆయా స్టేషన్లలో నమోదైన కేసులకు సంబంధించి అక్కడి పోలీసులు కూడా సారవకోట పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు.

ప్రతిభ చూపితే భవిత నీదే



ఫ్యూచర్ క్రికెటర్ల ప్రతిభా ప్రావీణ్యతను గుర్తించేందుకు జిల్లా క్రికెట్ సంఘం (జెడ్‌సీఏ) నడుం బిగించింది. గార మండలం కళింగపట్నంలోని జెడ్‌సీఏ క్రికెట్ మైదానంలో జిల్లాస్థాయి అండర్-12 బాలుర ప్రాబబుల్స్ జట్టుకు ఎంపికైన చిన్నారులకు సెలక్షన్ మ్యాచ్‌లను నిర్వహిస్తున్నారు. మూడు రోజులపాటు క్రీడాకారులు బ్యాటింగ్, బౌలింగ్, క్రమశిక్షణ, సత్ప్రవర్తన వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని తుది జట్టుకు ఎంపికచేయనున్నారు. జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షుడు పీవైఎన్ శాస్త్రి, మెంటార్ ఇలియాస్ మహ్మద్, కోశాధికారి మదినీ శైలానీ, కోచ్‌లు సుదర్శనరావు, ఆనంద్, రాజబాబు, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

– శ్రీకాకుళం న్యూకాలనీ

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి



రణస్థలం: మండలంలోని పాత పెట్రోల్ బంకు సమీపంలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో వృద్ధుడు గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. జేఆర్ పురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జేఆర్‌పురం గ్రామంలో నివాసం ఉంటున్న రైల్వే విశ్రాంత ఉద్యోగి తలసముద్రపు పాటయ్య (67) పాత పెట్రోల్ బంకులో పెట్రోల్ కొట్టేందుకు ద్విచక్ర వాహనంపై సోమవారం వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో గరికపాలెం వైపు వస్తుండగా లావేరు వైపు నుంచి వచ్చిన మరో ద్విచక్ర వాహనం ఢీకొంది. దీంతో వృద్ధుడైన పాటయ్యకు తీవ్ర గాయాలవ్వడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అప్పటికే పరిస్థితి విషమంగా ఉండటంతో, విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందాడు. మృతుడి స్వగ్రామం సంతబొమ్మాళి మండలంలోని ఉంకిలివానిపేట. ప్రమాదంపై జేఆర్‌పురం ఎస్ఐ ఎస్.చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

సామాజిక పింఛన్ల తనిఖీ

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలోని సంత సీతారాంపురం పంచాయతీలో ప్రభుత్వ ఆదేశాల మేరకు సామాజిక పింఛన్ల తనిఖీ నిర్వహించారు. సంతసీతారంపురం, చినరావుపల్లి, బలిజిపేట, నందిగాం గ్రామాలు ఉన్నాయి. లావేరు, రణస్థలం మండలాల సచివాలయ ఉద్యోగులు ఈ తనిఖీల్లో పాల్గొన్నారు. గ్రామంలో అన్ని రకాల పింఛన్లు 425 ఉన్నాయి. ఎచ్చెర్ల ఎంపీడీఓ సీపాన హరి హరరావు, ఈఓపీఆర్డీ బత్తుల మల్లేశ్వరరావు, ఎస్ఎంపురం పశువైద్యాధికారి గడ్డవలస సురేష్ తదితర అధికారులు పర్యవేక్షిస్తున్నారు. ఎప్పటి నుంచి పింఛన్ తీసుకుంటున్నారు, కేటగిరి, అర్హత, రేషన్ కార్డు, ఆధార్ కార్డు, కుటుంబ నేపథ్యం వంటివి పరిశీలిస్తున్నారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఈ పరిశీలన పరిశీలించారు. ప్రభుత్వం పింఛన్లు తీసేస్తుందేమోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా తనిఖీ చేస్తున్నామన్నారు.

సారా ప్యాకెట్లతో వ్యక్తి అరెస్టు

ఇచ్ఛాపురం: ఒడిశా నుంచి సారా ప్యాకెట్లను ఆంధ్రాకి తరలిస్తుండగా ఒడిశాకి చెందిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎస్ఐ పి.దుర్గాప్రసాద్ తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. సోమవారం ఇచ్ఛాపురం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సమయంలో లావణ్య దొళాయి అనే వ్యక్తి తన స్కూటీపై 300 ప్యాకెట్ల సారా తీసుకొస్తుండగా పట్టుబడ్డాడు. దీంతో సారా ప్యాకెట్లతో పాటు ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకొని, లావణ్య దొళాయిని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. నాటుసారా అక్రమ రవాణా, తయారీపై చర్యలు తప్పవని హెచ్చరించారు. మద్యాన్ని ఎంఆర్‌పీ కంటే ఎక్కువ రేటుకు అమ్మినట్లయితే 94408 30285 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఎస్పీ గ్రీవెన్స్‌కు 64 వినతులు


ఫిర్యాదుదారునితో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ రమణ

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీకోసం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (ఎస్పీ గ్రీవెన్సు)కు అర్జీదారుల నుంచి 64 వినతులు అందాయి. అదనపు ఎస్పీ కె.వి.రమణ ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు.

పద్నాలుగున్నర కిలోల గంజాయితో ఒకరు అరెస్టు


ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతున్న సీఐ మీసాల చిన్నంనాయుడు

ఇచ్ఛాపురం: ఒడిశా నుంచి అక్రమంగా కేరళకు పద్నాలుగున్నర కిలోల గంజాయిని తరలిస్తున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు సీఐ మీసాల చిన్నంనాయుడు తెలిపారు. సీఐ కార్యాలయంలో సోమవారం పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సీఐ మాట్లాడుతూ ఒడిశా రాష్ట్రం, గజపతిజిల్లా మోహన్ బ్లాక్‌కి చెందిన బిద్యాసాగర్‌సింగ్ అనే వ్యక్తి ఒడిశాలోని సింకులిపడర్‌కి చెందిన కుమార్ అనే వ్యక్తి వద్ద నుంచి గంజాయి కొనుగోలు చేసి కేరళలకు తీసుకెళ్తున్నట్లు తెలిపారు. అక్కడ గంజాయి వ్యాపారం చేసే సాహిల్‌ఖాన్‌తో ఇతనికి పరిచయం ఉందని, తరచుగా ఒడిశా నుంచి గంజాయి తీసుకెళ్తుంటాడని తెలిపారు. సోమవారం ఇచ్ఛాపురం జాతీయ రహదారి ఆనుకొని ఉన్న శ్రీధనరాజ్ తులసమ్మ ఆలయం సమీపంలో అతడు అనుమానాస్పదంగా కనిపించడంతో తనిఖీచేశామని, బ్యాగులో 14.450 కేజీల గంజాయిని గుర్తించామని చెప్పారు. గంజాయితో పాటు ఒక సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకొని అతడిని అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఇందులో రూరల్‌ఎస్సై శ్రీనివాసరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

8 కిలోల గంజాయితో ఒడిశా వ్యక్తి

పాతపట్నం: అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఒడిశాకు చెందిన సంజయ్ బదరైతాను సోమవారం అరెస్టు చేశారు. మండలంలోని కాపుగోపాలపురం సమీపంలో ఆంధ్ర-ఒడిశా సరిహద్దు ప్రాంతంలో ఒడిశా రాష్ట్రం, గంజాం జిల్లా, సురాడ బ్లాక్(మండలం), పాగిడి గ్రామానికి చెందిన సంజయ్ బదరైతా వద్ద నుంచి 8.132 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని సీఐ వి.రామారావు తెలిపారు. పాతపట్నం పోలీస్‌స్టేషన్‌లో సీఐ సోమవారం నిందితుడిని మీడియా ముందు హాజరుపరిచారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా నుంచి 8.132 కిలోల గంజాయిని రెండు బ్యాగుల్లో మూడు ప్యాకెట్లుగా తయారు చేసి సంజయ్ బద రైతా, జెనపోడ గ్రామానికి చెందిన మరో వ్యక్తితో కలిసి నెల్లూరులో అమ్మటానికి సోమవారం బయల్దేరారు. పర్లాకిమిడికి రాగానే తాను పాతపట్నంలో కలుస్తానని చెప్పి, గంజాయిని సంజయ్ బద రైతాకు మరోవ్యక్తి ఇచ్చేశాడు. దీంతో సంజయ్ పర్లాకిమిడి నుంచి కాపుగోపాపురం మీదుగా నడుచుకుంటూ పాతపట్నం వైపు వస్తుండగా పోలీసులు పట్టుకుని గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సంజాయ్ వద్ద నుంచి గంజాయిని, సెల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని, అతనిపై కేసు నమోదు చేశామని, రిమాండ్‌కు తరలిస్తామని సీఐ తెలిపారు. ఎస్ఐ బి.లావణ్య, పోలీసులు పాల్గొన్నారు.

నూతన అవిష్కరణలు అవసరం

ఎచ్చెర్ల క్యాంపస్: బయో టెక్నాలజీలో నూతన ఆవిష్కరణలు అవసరమని కెనడాకు చెందిన మానిటోబా యూనివర్సిటీ హెల్త్ సైన్స్ విభాగం ప్రొఫెసర్ చెలికాని ప్రసేన్ అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో బయో టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో ప్రస్తుతం బయో టెక్నాలజీలో నూతన అవిష్కరణలు-వైద్య శాస్త్ర ప్రగతి, ప్రపంచ ఆరోగ్యంలో పరిణామాలు అన్న అంశంపై సదస్సు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బయో టెక్నాలజీ పరిశోధనలు వైద్యం, ఆరోగ్యం, వ్యవసాయం, పర్యావరణ ఇలా అన్ని రంగాల్లో కీలకంగా మారాయన్నారు. వ్యాధుల నియంత్రణ, నూతన వ్యాక్సిన్ల తయారీ, బ్యాక్టీరియా, వైరస్ నిర్మూలన వంటివి కీలకమన్నారు. కార్యక్రమంలో అమెరికాకు చెందిన అలబామా విశ్వవిద్యాలయం మేమటాలజీ, అంకాలజీ విభాగం ప్రొఫెసర్ జి.పూర్ణచంద్రనాగరాజు, బీఆర్ఏయూ వీసీ కె.ఆర్.రజిని, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షి పాల్గొన్నారు.

ఆస్తి గొడవలే హత్యకు కారణం

- శ్రీకూర్మం హత్యకేసులో నిందితులకు రిమాండ్
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ వివేకానంద

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా ఆధ్యాత్మిక కేంద్రం శ్రీకూర్మంలో ఇటీవల జరిగిన హత్యకు ఆస్తి గొడవలే కారణమని పోలీసులు నిర్ధారించారు. హత్యకు సంబంధించి ఎనిమిది మంది నిందితులను సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఆస్తికి సంబంధం లేని ఉప్పాడ రాజేష్ అన్నీ వెనకుండి నడిపించాడనే కోపంతో ప్రత్యర్థులు ఆయన్ని మట్టుబెట్టారని డీఎస్పీ సీహెచ్ వివేకానంద వెల్లడించారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని గూనపాలెం సమీప సబ్ డివిజనల్ కార్యాలయంలో సోమవారం పత్రికా సమావేశం నిర్వహించారు.

1.40 ఎకరాల భూమిపై వివాదం

బలివాడ గ్రామానికి చెందిన ఉప్పాడ రాములమ్మ, కొయ్యా భాస్కరరావులకు గత కొంతకాలంగా శ్రీకూర్మం పంచాయతీ పరిధి చింతవలస గ్రామ సరిహద్దున ఉన్న 1.40 ఎకరాల వ్యవసాయ భూమి కోసం వివాదం నడుస్తోంది. రాములమ్మ భర్త రాజారావు పేరున ఉన్న ఈ భూమి ఆయన చనిపోవడంతో రాములమ్మ వద్దే డాక్యుమెంట్లు (అధీనంలో) ఉన్నాయి. ఇరువర్గాలు సివిల్ తగాదాలు పడడంతో కోర్టులో కూడా రాములమ్మకు తీర్పు అనుకూలంగా వచ్చింది. అయినప్పటికీ కొయ్యా భాస్కరరావు ఆ భూమిని తన అనుభవంలోనే ఉంచుకున్నారు.


పట్టుబడిన నిందితులతో డీఎస్పీ వివేకానంద, చిత్రంలో సీఐ పైడపునాయుడు

రిజిస్ట్రేషన్ కావడంతో...

ఇదే భూమిని ఉప్పాడ సూర్యనారాయణ, అనపాన షణ్ముఖరావు, చుక్కా రాములకు రాములమ్మ రూ.28.50 లక్షలకు అమ్మకం జరిపి రిజిస్ట్రేషన్ జరిపించింది. మ్యుటేషన్ పూర్తి చేసి ముగ్గురూ రెవెన్యూ రికార్డులు సైతం పొందారు. గ్రామానికే చెందిన ఉప్పాడ రాజేష్ (మృతుడు) రాములమ్మకు సహకరించడంలోను, సూర్యనారాయణ తదితరులు భూమిని కొనుగోలు చేయడంలో వెనకుండి నడిపించడంతో భాస్కరరావు వర్గం రాజేష్‌పై కక్షగట్టారు. భూమిని కొన్నారన్న కక్షతో సూర్యనారాయణ వర్గంతో పాటు రాజేష్‌ను మట్టుబెట్టాలని దాడికి పథకం రచించారు. ఈ క్రమంలో ఈనెల 6వ తేదీన రాత్రి 7 గంటల సమయంలో సూర్యనారాయణ, రాజేష్, చుక్క రాములు శ్రీకూర్మం బస్టాండ్ వద్ద కాయగూరలు కొని తిరిగి ఇంటికి వెళ్తుండగా జెడ్పీ హైస్కూల్ సమీప సీసీ రోడ్డు వద్దకు వచ్చేసరికి ప్రత్యర్థులు దాడి చేశారు. ఈ దాడిలో రాజేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం పోలీసులు కేసు నమోదు చేసి నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

పాత కక్షలూ కారణమే..

2018లో ఉప్పాడ సూర్యనారాయణకు సంబంధించిన వేరే ఆస్తి విషయంలో కూడా ఇలాగే భాస్కరరావు వర్గం గొడవలు పడి అప్పుడు కూడా హత్యాప్రయత్నం చేశారు. ఆ కేసులో వంద రోజులు రిమాండ్‌లో కూడా ఉన్నారు. ప్రస్తుతం ఆ కేసు పెండింగ్‌లో ఉంది. నిందితులైన భాస్కరరావు వర్గీయులపై మరో కేసు ఉండగా అది లోక్ అదాలత్‌తో క్లియర్ అయ్యింది. తక్కువ సమయంలో కేసును చాకచక్యంగా ఛేదించిన సీఐ పైడపునాయుడు, ఎస్ఐ జనార్ధన బృందాలను డీఎస్పీ అభినందించారు.